

బిచ్కుందలో వంద పడకల దవాఖాన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు, ఎంపీ బీబీపాటిల్, జుక్కల్ ఎమ్మెల్యే షిండే, జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దఫేదార్ రాజు



ధర్పల్లిలో వంద పడకల దవాఖాన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు, ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్ గుప్తా, జడ్పీ చైర్‌పర్సన్ విఠల్‌రావు, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్



- సీఎం కేసీఆర్ పరిపాలనలో ప్రతి కుటుంబానికీ మేలు
- ప్రజల్లో బలంలేని కాంగ్రెస్ పార్టీ ఫేక్ సర్వేలను నమ్మొద్దు
- ప్రతిపక్షాలకు దిమ్మ తిరిగే కేసీఆర్ మ్యానిఫెస్టో
- బీఆర్ఎస్ బహిరంగ సభల్లో రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు
- బిచ్కుంద, ధర్పల్లిలో 100 పడకల దవాఖానల నిర్మాణానికి శంకుస్థాపన
- ఉభయ జిల్లాల్లో 4 గంటలపాటు ఆరోగ్య శాఖ మంత్రి సుడిగాలి పర్యటన

## మహారాష్ట్రలో గొడ్డుకారం..

# ఇక్కడ మమకారం..

నిజామాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) /నిజాంసాగర్/డిచ్‌పల్లి/ ధర్పల్లి

మహారాష్ట్ర సర్కారు మధ్యాహ్న భోజనంలో అన్నం, గొడ్డుకారంతో పెడితే.. మన దగ్గర కేసీఆర్ పాలనలో మమకారంతో సన్నబియ్యం, పౌష్టికాహారాన్ని పిల్లలకు అందిస్తున్నామని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ఫేక్ సర్వేలు చేయించి మాకే సీట్లు ఎక్కువ అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు. ఓ వైపు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, మరోవైపు బీఆర్ఎస్ శ్రేణులతో సమావేశాలు, ప్రజలతో బహిరంగ సభలు.. ఉమ్మడి జిల్లాలో శుక్రవారం హెలికాప్టర్ ద్వారా 4 గంటలపాటు సుడిగాలి పర్యటన చేశారు. ఉభయ జిల్లాల్లోని బిచ్కుంద, ధర్పల్లి మండల కేంద్రాల్లో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇప్పటికే మంజూరైన 100 పడకల దవాఖానలకు ప్రభుత్వం ఇంతకుముపే చెప్పినట్లుగానే శాశ్వత భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బిచ్కుందలో 30 పడకల దవాఖాన స్థానంలో 100 పడకలకు అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వం రూ.26 కోట్లు విడుదల చేసింది. ఇందుకోసం స్థానిక ఎమ్మెల్యే హన్మంత్ షిండే, ఎంపీ బీబీపాటిల్, జడ్పీ చైర్‌పర్సన్ దేఫేదార్ శోభారాజుతో కలిసి మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. అనంతరం నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో రూ. 33కోట్లతో నూతనంగా నిర్మించనున్న 100 పడకల దవాఖాన పనులకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్‌గుప్తా, జడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావుతో కలిసి శంకుస్థాపనలో పాల్గొన్నారు. అనంతరం బీఆర్ఎస్ శ్రేణులను ఉద్దేశించి హరీశ్‌రావు దిశానిర్దేశం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు.



మంత్రి హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే హన్మంత్‌షిండే, జడ్పీ చైర్‌పర్సన్ శోభారాజు దంపతులు



బిచ్కుంద బహిరంగ సభకు వస్తున్న దివ్యాంగుడు

### ఏడాదిలోనే ధర్పల్లి దవాఖాన

ఒకప్పుడు రోగాలు వస్తే దవాఖానకు 50 కిలో మీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు అలాంటి కష్టాలు లేకుండా వంద పడకల పెద్దాదవాఖానను ధర్పల్లికి తీసుకువచ్చామన్నారు. దీనిని రూ. 33కోట్లతో ఏడాదిలోనే పూర్తిచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. 100 పడకల దవాఖాన కోసం ఎమ్మెల్యే గోవర్ధన్ ఎంతో కృషి చేశారని, సీఎం కేసీఆర్‌తోపాటు తనను మెప్పించి, ఒప్పించి తెప్పించారన్నారు. రాష్ట్ర సాధనలో కేసీఆర్ లాగ మొండి పట్టుదలతో కృషి చేస్తున్న బాజిరెడ్డి ఎమ్మెల్యేగా ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. కేసీఆర్ తర్వాత ప్రతి నియోజకవర్గంలో గెలిచిన వ్యక్తి బాజిరెడ్డి అని కనియాడారు. ఎమ్మెల్యే కోరిక మేరకు ధర్పల్లికి మాతా, శిశు సంరక్షణ కేంద్రాన్ని, ఇందల్వాయిలో ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కాంగ్రెస్ పాలనలో మందులు, డాక్టర్లు ఉండేవారే కాదని చెప్పారు. 35 కళాశాలు ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, సీఎం కేసీఆర్ వచ్చాక సర్కారు వైద్యంపై ప్రజలకు భరోసా పెరిగిందన్నారు. నిజామాబాద్ జీజీహెచ్‌లో ప్రతినెలా 1200 డెలివరీలు జరుగుతున్నాయని, తెలిపారు.

### బీజేపీ ఫెయిల్యూర్ సర్కార్...

మొన్న నిజామాబాద్‌కు వచ్చిన ప్రధాని మోదీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని మంత్రి మండిపడ్డారు. వాళ్ల డబుల్ ఇంజిన్ సర్కారు ఫెయిల్ అయ్యిందన్నారు. నాందేడ్ దవాఖానలో 40మంది పిల్లలు చనిపోవడం బాధాకరమని, మహారాష్ట్రలో మందుల్లేవు, సూదుల్లేవని దవాఖాన పర్యవేక్షకుడే చెబుతున్నాడంటే బీజేపీ ప్రభుత్వం వైఫల్యాన్ని తేటతెల్లం చేస్తున్నదని ఆరోపించారు. కేంద్రంలో, మహారాష్ట్రలో బీజేపీ ఉన్నప్పటికీ దవాఖానలను బాగు చేసుకోలేని దుస్థితిని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. సంక్షేమంలో స్వర్ణయుగం... అభివృద్ధిలో అద్భుతం అన్నట్లుగా కేసీఆర్ పరిపాలన కొనసాగుతున్నదని చెప్పారు. రాష్ట్రానికి సరిహద్దులో ఉన్న జుక్కల్ నియోజకవర్గంలో బిచ్కుంద దవాఖానకు గతంలోనే డయాలసిస్ సేవలను తెచ్చామని, ఇప్పుడు వంద పడకల దవాఖాన నిర్మిస్తున్నామని చెప్పారు.

### కేసీఆరే హ్యాట్రిక్ సీఎం...

త్వరలోనే ప్రతిపక్షాలకు దిమ్మదిరిగే మ్యానిఫెస్టోను సీఎం కేసీఆర్ ప్రకటించబోతున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా హ్యాట్రిక్ కొట్టేది కేసీఆరేనని ధీమా వ్యక్తం చేశారు. కర్ణాటకలోని అవినీతి సొమ్ముతో మోసం చేయాలని చూస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మోదీ, రాహుల్ గాంధీకి తెలంగాణపై అవగాహన ఉన్నదా? అని ప్రశ్నించారు. కేసీఆర్ రైతు పక్షపాతి అని, కరోనా సమయంలో ఎంత కష్టం ఉన్నా, రైతులకు రైతుబంధు ఆపొద్దని ముఖ్యమంత్రి ఆదేశించారనే విషయాన్ని గుర్తుచేశారు. ఎన్నికల్లో మోసపోతే ఆగం అవుతామని, కైలాసం ఆటలెక్క పెద్దపాము మింగే అవకాశం ఉందందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య మంత్రి సూచించారు. దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల్లో బీడీలు చేస్తున్న కార్మికులను ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదని, సీఎం కేసీఆర్ మాత్రమే తెలంగాణలోని కార్మికులకు రూ.2016 చొప్పున పింఛన్లు అందించి, వారి ఇబ్బందులను తొలగించారని తెలిపారు. బీజేపీ జీఎస్టీ వేస్తే, కాంగ్రెస్ పుర్రె గుర్తు పెట్టి బీడీ పరిశ్రమను దెబ్బతీసిందని, కానీ కార్మిక కుటుంబాలను కేసీఆర్ ఆదుకున్నారని తెలిపారు.

### సెంట్రల్ లైటింగ్ పనులు, బోటింగ్ పాయింట్ ప్రారంభం..

ధర్పల్లి/సిరికొండ, అక్టోబర్ 6 : ధర్పల్లి మండల కేంద్రంలో రూ. 6.5 కోట్లతో చేపట్టనున్న సెంట్రల్ లైటింగ్ పనులతోపాటు స్థానిక చెరువు వద్ద ఏర్పాటుచేసిన బోటింగ్ పాయింట్‌ను మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్‌గుప్తా శుక్రవారం ప్రారంభించారు. అనంతరం బోట్‌లో కొద్దిసేపు షికారు చేసి మాట్లాడారు. ఎమ్మెల్యే బాజిరెడ్డి కృషితో నియోజకవర్గంలో రూ. 200 కోట్ల అభివృద్ధి జరిగిందని, ఇంకా చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో జనరంజక పాలక కొనసాగుతున్నదని అన్నారు. అనంతరం ఆయన వాడీ గ్రామంలో పెద్దవాగుపై రూ. 7 కోట్లతో నిర్మించనున్న బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ఐడీసీఎంఎస్ చైర్మన్ సంబారి మోహన్, ఎంపీపీలు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.



బిచ్కుందలో ఏర్పాటు చేసిన సభలో చేతులెత్తి బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటిస్తున్న ప్రజలు

### అన్ని స్థానాల్లో మేమే గెలుస్తాం..

–మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



శ్రీరాముడికి హన్మంతుడు ఎట్లనో.. కేసీఆర్‌కు హరీశ్‌రావు అలాంటి వారని మంత్రి వేముల అన్నారు. సీఎం మార్గదర్శనంలో మంత్రిగా ఎంతో శ్రమిస్తారని తెలిపారు. మిషన్ కాకతీయతో నేడు చెరువులన్నీ నిండుగా మారాయన్నారు. పేదలకు వైద్య సేవలు అందించేందుకు వైద్య శాఖను ఉన్నతంగా తీర్చిదిద్ది సీఎం కలను నెరవేర్చారని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీనే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇందులో ఎలాంటి డౌట్ లేదన్నారు.

### దేశంలోనే ఎక్కడా లేని పథకాలు తెలంగాణలో

–ఎంపీ బీబీపాటిల్



నిజాంసాగర్: దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు సీఎం కేసీఆర్ తెలంగాణలో ప్రవేశపెట్టారని జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ అన్నారు. మన పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తుచేశారు. తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు నేడు సంతోషంగా ఉన్నారని తెలిపారు. మరోమారు అధికారంలోకి వచ్చాక మరిన్ని పథకాలు ప్రజలకు అందనున్నాయని తెలిపారు.

### ఇక ఆరోగ్య అవస్థలు దూరం



–రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి

ధర్పల్లి: ధర్పల్లిలో నిర్మించనున్న వంద పడకల దవాఖానతో మండల ప్రజల ఆరోగ్య అవస్థలు ఇక దూరం కానున్నాయని రూరల్ ఎమ్మెల్యే బాజిరెడి గోవర్ధన్ అన్నారు. ఇది పేదలకు ఎంతో సౌకర్యంగా మారనుందని అన్నారు. ఐసీయూ, ప్రసూతి కేంద్రం, అత్యవసర చికిత్సలు అందించడంతో పాటు పోస్ట్‌మార్టం కూడా ఇక్కడే జరుగుతాయని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపిన కేసీఆర్, వైద్యరంగాన్ని ఊహించని రీతిలో అభివృద్ధి చేసిన మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. మన చెరువు కట్టలు బలోపేతం కావడానికి హరీశ్‌రావు కృషేనని కొనియాడారు. రెండు పంటలకూ సాగునీరు పుష్కలంగా అందుతున్నాయని తెలిపారు.

### పదేండ్లలోనే జుక్కల్‌కు పుష్కలంగా నిధులు

–ఎమ్మెల్యే షిండే



నిజాంసాగర్: పదేండ్లలో జుక్కల్ నియోజకవర్గానికి గతంలో ఎన్నడూ లేనివిధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పుష్కలంగా నిధులు మంజూరు చేయడంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. మంత్రి హరీశ్‌రావు నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు సింగీతం చెరువుకు అడగగానే నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. నియోజకవర్గంలో 256 చెరువులను బాగు చేసుకున్నామని తెలిపారు. కేసీఆర్ కామారెడ్డి నుంచి గెలిచాక దళితబంధు పథకం జిల్లా మొత్తం అమలవుతుందన్నారు. నిజాంసాగర్, కౌలాస్‌నాలా, రామేశ్వరం గుట్ట, సలాభత్‌పుర్ ఆలయాన్ని పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.



దేవునిపల్లి పాఠశాలలో విద్యార్థులకు టిఫిన్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్



- ఉమ్మడి జిల్లాలో 'సీఎం బ్రేక్‌ఫాస్ట్' ప్రారంభం
- విద్యార్థులకు అల్పాహారం అందజేసిన స్పీకర్ పోచారం, మంత్రి వేముల, ఎమ్మెల్యేలు

# కమ్మని అల్పాహారం.. కడుపు నిండా భోజనం

నమస్తే తెలంగాణ యంత్రాంగం, అక్టోబర్ 6: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా చేపట్టిన 'సీఎం బ్రేక్‌ఫాస్ట్' పథకం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఆయా పాఠశాలల్లో ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. స్వయంగా విద్యార్థులకు వడ్డించి అక్కడే అల్పాహారం చేశారు.

**అల్పాహార పథకం చారిత్రాత్మకం : స్పీకర్ పోచారం**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం జక్కల్‌దాని తండాలో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి అల్పాహార పథకం చారిత్రాత్మకమన్నారు. సీఎం కేసీఆర్ నిర్ణయంతో రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 20లక్షల మంది విద్యార్థులకు రుచికరమైన టిఫిన్ అందనున్నదన్నారు.

**కేసీఆర్ మానవీయ పథకం : మంత్రి వేముల**

సీఎం కేసీఆర్ మదిలోంచి పుట్టిన మరో మానవీయ పథకమే 'సీఎం బ్రేక్‌ఫాస్ట్' అని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. వేల్పూర్ మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1.46 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం అందనున్నదన్నారు. బ్రేక్‌ఫాస్ట్ అందించే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, శుచి, శుభ్రతను తప్పనిసరిగా పాటించాలని ఉపాధ్యాయులు, నిర్వాహకులకు సూచించారు. పిల్లలందరూ డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, సైంటిస్టులు కావాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆశీర్వదించారు. తాను చదువుకున్న పాఠశాలలోనే నేడు మంత్రి హోదాలో ఈ కార్యక్రమాన్ని పారంభించడం ఆనందగా ఉన్నదని వేముల తెలిపారు. ఆర్మూర్ పట్టణంలోని రాంమందిర్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, నిజామాబాద్ నగరంలోని పోలీస్‌లైన్ ప్రాథమిక పాఠశాలలో అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, బోధన్‌లోని గాంధీనగర్ పాఠశాలలో ఎమ్మెల్యే షకీల్, కామారెడ్డి పట్టణ పరిధిలోని దేవునిపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, పిట్లం మండల కేంద్రంలోని బోయివాడ పాఠశాలలో ఎమ్మెల్యే హన్మంత్ షిండే, రామారెడ్డి మండలం ఇసన్నపల్లిలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజా సురేందర్ సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించారు.



పిట్లంలో చిన్నారులతో కలిసి టిఫిన్ చేస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే షిండే, జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభారాజు, కలెక్టర్ జితేశ వీ పాటిల్



రామారెడ్డి మండలం ఇసన్నపల్లి పాఠశాలలో అల్పాహారం అందజేస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్